# ఎవరినీ కించపరుచలేదు..

## - ఓర్వలేకే సోషల్ మీడియాలో దుష్ప్రచారం

### - ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి, క్విక్ టుడే :** యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు దర్శించుకోవడం హర్షించదగిన విషయం అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ తదితరులు హాజరు కావడం శుభపరిణామమని అన్నారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ముఖ్యమంత్రి దాదాపు గంటన్నర పాటు కలియతిరిగి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసున్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనలో కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది ఓర్వలేని తనంతో చేస్తున్న దుర్బుద్ధి అని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గత పాలకులు యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో ఎవరికీ ప్రాధాన్యత ఇవ్వలేదని విషయాన్ని గుర్తు చేశారు. గిట్టని వారు సోషల్ మీడియా వేదికగా డిప్యూటీ సీఎం పట్ల దుష్ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి



దృష్టిలో అందరికీ సమాన గౌరవం ఉంటుందని, మేము కూడా అందర్నీ సమానంగా గౌరవించామని తెలిపారు. ముఖ్యమంత్రి సందర్శనార్థం వచ్చినప్పుడు వారికి కేటాయించిన సీట్లు హెచ్చుతగ్గు ఉండటం వల్ల భట్టి విక్రమార్క తక్కువ ఎత్తులో కూర్చున్నట్లు వివరణ ఇచ్చారు. అయితే దీనిని కొందరు సోషల్ మీడియా వేదికగా గిట్టని వాళ్లు అవమానించినట్లు వక్రీకరించడం తగదన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం బ్రహ్మోత్సవాలకు సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరు కావడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని, దీనిని తప్పుగా ప్రచారం చేయాలని నిర్ణయించి కించపరిచేటట్లు సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేశారని అన్నారు. మరో వారం రోజుల్లో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, యాదగిరిగుట్టకు రావాల్సిన నిధులను తీసుకొచ్చి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గాలి గోపురానికి బంగారు తాపడం, హోమం చేయాలని ముఖ్యమంత్రి సూచించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. బ్రహ్మోత్సవాలకి ముఖ్యమంత్రి, మంత్రులు రావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. కొంతమంది గిట్టనివారు పనిగట్టుకుని ప్రభుత్వంపై చెడ్డ పేరు తేవాలని చూస్తున్నారని, ఎక్కడ చిన్న చిన్న లోపాలను ఉంటాయో వెతికి వాటిని పెద్దగా చేయాలని చూస్తున్నారని అన్నారు.

# మానవత్వం చాటుకున్న మహబూబాబాద్ బాంబ్ స్క్వాడ్ బృందం

### - మానవత్వాన్ని చాటుకున్న బాంబ్ స్క్వాడ్ బృందం



**భద్రాద్రి కొత్తగూడెం, క్విక్ టుడే :** భద్రాచలంలో సోమవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమానికి మహబూబాబాద్ నుండి భద్రాచలం వెళ్ళే మార్గ మధ్యంలో సత్యనారాయణపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తికి యాక్సిడెంట్ అయ్యింది. విధుల కోసం భద్రాచలం బయలుదేరిన మహబూబాబాద్ బాంబ్ స్క్వాడ్ బృందం గాయాల పాలైన వ్యక్తిని చూసి ఆగి , 108 కి ఫోన్ చేసి సదరు వ్యక్తిని మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. కాగా అక్కడ ఉన్న ప్రజలు బాంబ్ స్క్వాడ్ బృందాన్ని అభినందించారు.. ప్రమాద బాధితుడికి వైద్యులు చికిత్స చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ముస్లిం సోదరులకు రంజాన్ మాసం

# శుభాకాంక్షలు



**పీర్జాదిగూడ, క్విక్ టుడే :** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా ముస్లిం సోదరి సోదరమణులకు మేయర్ జక్క వెంకట్ రెడ్డి రంజాన్ నెల ప్రారంభ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తి శ్రద్ధలతో పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రతిదినం రోజా (ఉపవాసాలు) తరావి, నమాజ్లతో ముస్లిం ప్రజలందరూ విజయవంతంగా పూర్తిచేసుకోవాలని ఆకాంక్షించారు.

(మొదటి పేజీ తరువాయి)

# మోడీ, కేడీ ఇద్దరూ ఒక్కటే

ఇందిరమ్మ ఇండ్లను రూ.22,5000 కోట్లతో ప్రారంభించుకున్నాం. ఇప్పటికే 30వేల ప్రభుత్వ ఉద్యోగాలను నిరుద్యోగులకు అందజేశాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

**అంతర్జాతీయ స్థాయిలో పరువు తీసిన కేసీఆర్..**

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్ర పరువును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీసేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని దొంగల్లా చొరబడి దోచుకున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేర్లు మార్చి అందిన కాడికి కాజేశారు. కాళేశ్వరం మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులే ఇందుకు నిదర్శనం అన్నారు.

**బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..**

బీజేపీ, బీఆర్ ఎస్ రెండు పార్టీలు ఒక్కటే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేవలం 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న ఆపార్టీ నాయకులు లక్షణ్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలకు మించి ఉండదని అనడంలోనే ఇది బహిర్గతం అవుతుందని అన్నారు. ఈ రెండు పార్టీలు ఎలాగైనా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. ఇందుకోసం మోడీ, కేడీ ఏకం అయ్యారని అన్నారు. మోడీ, కేడీ కుట్రలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మాతో గోక్కుంటే ఎవరూ బాగుపడలేదని, అడ్డం వచ్చిన వారిని పండబెట్టి తొక్కుతామని హెచ్చరికలు జారీ చేశారు.

## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇండ్లు

జిల్లాలో రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో ఇస్తున్నామని, వారి కళ్లల్లో ఆనందం చూడాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్లు ఈ పథకం ద్వారా మంజూరు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని అన్నారు. నిజంగా ఆయన డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన ఊళ్లల్లో ఓట్లు అడుగాలని, మేం ఏ ఊళ్లల్లో అయితే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామో అక్కడ మేము ఓట్లు అడుగుతామని మాజీ సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సవాల్ విసిరారు. పార్టీతో సంబంధం లేకుండా అర్హులందరికీ మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తుందని అన్నారు. కట్టు కథలతో తెలంగాణ ప్రజలను కేసీఆర్ మోసం చేశారని, అందుకే ఆయన ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు బొందపెట్టారని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాలో ఎప్పటి నుంచో కాంగ్రెస్ కు అనుబంధం ఉందని అన్నారు. అందుకే 2014, 2016, 2003 ఎన్నికల్లో కేసీఆర్ ఒక్క స్థానంతో సరిపెట్టుకున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ మోసపు మాటలను ఖమ్మం ప్రజలు నమ్మలేదని వివరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ భద్రాద్రి రాముడిని కూడా కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. భద్రాద్రి శ్రీరాముడి ఆలయ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయిస్తానని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**కాంగ్రెస్‌కు బిగ్ షాక్?..**
**నల్లగొండ నుంచి బీజేపీ అభ్యర్థిగా రమేష్ రెడ్డి..?**

**నల్లగొండ :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల విజయంతో జోష్ మీదున్న కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. లోక్ సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన పటేల్ రమేష్ రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకోనేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. నల్లగొండ జిల్లాలో బలమైన నేత రమేష్ రెడ్డి పార్టీకి దూరమైతే ఒకింత కాంగ్రెస్‌కు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల విజయంతో జోష్ మీద ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ కు తాజాగా బిగ్ షాక్ తగిలింది. లోక్ సభ ఎన్నికలలో నల్గొండ టికెట్ ఆశించి భంగపడిన పటేల్ రమేష్ రెడ్డి కమలం గూటికి చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. నల్గొండ జిల్లాలో బలమైన నేతల్లో ఒకరైన పటేల్ రమేష్ రెడ్డి పార్టీ మారాలన్న నిర్ణయం ఆ జిల్లాలో కాంగ్రెస్ కు ఒకింత ఇబ్బంది కలిగించే విషయమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి పార్టీలో ఓ విధమైన జోష్ కొనసాగుతోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ రోజు రోజుకూ బలహీనపడటం, అదే సమయంలో పొరపొచ్చాలు లేకుండా కాంగ్రెస్ టీమ్ తెలంగాణలా పని చేయడంతో వచ్చే లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తుందన్న అంచనాలు కూడా పెరిగాయి. పలు సర్వేలు కూడా అదే విషయాన్ని వెల్లడించాయి. అయితే పంటి కింద రాయిలా నల్లగొండ లోక్ సభ స్థానం కోసం పోటీలో ఉన్న నేతల సంఖ్య ఎక్కువ కావడం, అలాగే ఆ టికెట్ ఆశిస్తున్న ఆశావహులంతా బలమైన నేతలే కావడం కాంగ్రెస్ కు చిక్కుగా మారింది. అసెంబ్లీ ఎన్నికలలో సూర్యాపేట టికెట్ ఆశించిన పటేల్ రమేష్ రెడ్డికి టికెట్ దక్కలేదు. అయితే అప్పట్లో పార్టీ హై కమాండ్ ఆయనను లోక్ సభ ఎన్నికలలో నల్గొండ నుంచి దింపుతామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే తీరా లోక్ సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానం మళ్లీ పటేల్ రమేష్ రెడ్డికి హ్యాండ్ ఇచ్చింది. నల్లగొండ నుంచి లోక్ సభకు పోటీ చేసేందుకు మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కుమారుడు రఘువీరారెడ్డికి టికెట్ ఇచ్చింది. దీంతో పటేల్ రమేష్ రెడ్డి ఇక కాంగ్రెస్ తో లాభం లేదన్న నిర్ణయానికి వచ్చేశారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పటేల్ రమేష్ రెడ్డి బీజేపీ గూటికి చేరాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయన బీజేపీతో టచ్ లోకి వెళ్లారని చెబుతున్నారు. బీజేపీ కూడా పటేల్ రమేష్ రెడ్డి వంటి కీలక నేత పార్టీలో చేరితే నల్లగొండలో పార్టీ బలోపేతమౌతుందని భావిస్తోందని అంటున్నారు. అందుకే ఆయన చేరికను బీజేపీ స్వాగతిస్తున్నదని చెబుతున్నారు. పటేల్ రమేష్ రెడ్డి పార్టీలో చేరితే ఆయనను నల్లగొండ నుంచి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు బీజేపీ రెడీగా ఉందని అంటున్నారు.

ఇక పటేల్ రమేష్ రెడ్డి కూడా తన అనుచరులతో ఈ విషయమై జోరుగా చర్చిస్తున్నారనీ, నేడో రేపో ఆయన కమలం గూటికి చేరే అవకాశాలే మెండుగా ఉన్నాయనీ పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు.




## దేవుడి సాక్షిగా డిప్యూటీ సీఎంకు


# ఇంతటి అవమానమా..?

### - బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జి మేడి ప్రియదర్శిని




**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (క్విక్ టుడే) :** యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సాక్షిగా డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అవమానం జరిగిందని బి ఎస్ పి నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జి మేడి ప్రియదర్శిని అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ%ూ% రెడ్డి నాయకుల దగ్గర ఒక ఎస్సీ బిడ్డను క్రింద కూర్చో బెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సతీమణిని పైన కూర్చోబెట్టి బీసీ బిడ్డ అయిన కొండా సురేఖను క్రింద కూర్చోబెట్టారన్నారు. దేవుడి దగ్గరే ఇంత అవమానం జరిగితే దళిత జాతి ఎక్కడ చెప్పుకోవాలి?%ూ% ఎవరికి చెప్పుకోవాలి? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైనా భట్టి విక్రమార్కనే అవమానించారన్నారు. 74 యేండ్ల స్వాతంత్ర భారతంలో దళితులకు కాంగ్రెస్ పార్టీలో అవమానం జరుగుతుందన్నారు. యావత్ దళిత జాతిని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి భట్టి విక్రమార్క ఫోటో పక్కన పెడుతున్నారని, ప్రభుత్వ యాడ్స్‌లో డిప్యూటీ సీఎం ఫోటోను పక్కన పెట్టారన్నారు. జరిగిన ఘటనపై నయా దేశ్ ముఖ్ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్కకు జరిగిన అవమానంపై కాంగ్రెస్ పార్టీ హైకామండ్ స్పందించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటన జరగకుండా చూడాలని మేడి ప్రియదర్శిని డిమాండ్ చేశారు.



# తిండి నీళ్లు లేక చస్తున్నాం.. పిల్లలకు చదువు లేదు..

## జోక్యం చేసుకోండి మోడీజీ! ఎంఎంఎ విజేత వేడుకోలు

సుమారు ఏడాది కాలంగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు ఇకనైనా చరమగీతం పాడాలని ప్రజాసంఘాలు గొంతెత్తుతున్న వేళ ప్రముఖ క్రీడాకారుడు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఎ) ఫైటర్ చుంగ్రెంగ్ కొరెన్ వారికి మద్దతు పలికాడు. మణిపూర్‌కే చెందిన అతడు.. ఎంఎంఎ టోర్నీ గెలిచిన తర్వాత తమ రాష్ట్రంలో తలెత్తిన పరిస్థితులపై గొంతెత్తాడు. అక్కడ నెల కొన్ని హింస ద్వారా రోజూ జనం చస్తున్నారని, చిన్నపిల్లలకు చదువు దూరమైందని, రిలీఫ్ క్యాంపులలో ఆహార నిల్వలు అయిపోయి జనం ఆకలిపస్తులుంటున్నారని కన్నీరు మున్నీరయ్యాడు.గువహతి వేదికగా ముగిసిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ గెలిచిన తర్వాత కొరెన్ మాట్లాడుతూ 'మోడీ.. ఇది నా వినమ్రపూర్వక విన్నపం. మణిపూర్‌లో ఏడాదికాలంగా హింసాకాండ కొనసాగుతోంది. జనం రోజూ చస్తున్నారు. శరణార్థి గృహాలలో కూడా వేలాది మంది జనం ఉన్నారు. వాళ్ల ఆహార అవసరాలను తీర్చే సరుకులు నిండుకున్నాయి. చిన్నపిల్లలు బడులు లేక చదువులకు దూరమవుతున్నారు. మణిపూర్ భవిష్యత్‌ను తలుచుకుంటేనే మాకు ఆందోళనగా ఉంది. దయుంచి ఒక్కసారి మణిపూర్‌కు రండి. ఇక్కడ వీలైనంత త్వరగా శాంతిని నెలకొల్పండి' అంటూ కన్నీరుమున్నీరయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.మణిపూర్‌లో ఉన్న మైతేయి, కుకీ తెగల మధ్య నెలకొన్న ఘర్షణలు కాస్తా ఆ రాష్ట్రంలో సుమారు ఏడాదికాలంగా ఆందోళనలు మిన్నంటుతున్నాయి. అక్కడ ఇంటర్నెట్‌పై నిషేధంతో పాటు పౌరహక్కులను అణిచివేస్తున్నదని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే ఇక్కడ దాదాపు 220 మంది మరణించారని, 60 వేల మంది


స్థానభ్రమణం చెందారని నివేదికల ద్వారా తెలుస్తోంది.

# 2011 వరల్డ్ కప్ టు పాలిటిక్స్.. లోక్‌సభ బరిలో యూసుఫ్..

## ఆ జాబితాలో నాలుగో క్రికెటర్

భారత మాజీ ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ లోక్‌సభ బరిలో దిగబోతున్నాడు. పశ్చిమబెంగాల్‌లోని బెర్హామ్‌పూర్ నియోజకవర్గం నుంచి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తాజాగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో పఠాన్ పేరు కూడా ఉంది. కాగా 2011 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో యూసుఫ్ సభ్యుడు అన్న విషయం తెలిసిందే. ఆ టీమ్ నుంచి రాజకీయాలలోకి వచ్చిన నాలుగో క్రికెటర్‌గా పఠాన్ నిలిచాడు.సుమారు 28 ఏండ్ల తర్వాత ధోని సారథ్యంలోని భారత జట్టు.. వన్డే వరల్డ్ కప్ ట్రోఫీ స్వప్నాన్ని ముంబైలోని వాంఖెడే వేదికగా నెరవేర్చుకున్న విషయం తెలిసిందే. 16 మంది సభ్యులు గల ఈ జట్టులో రాజకీయాలలోకి వచ్చిన నాలుగో క్రికెటర్‌గా పఠాన్ నిలిచాడు. ఈ జాబితాలో గౌతం గంభీర్, హర్భజన్ సింగ్, శ్రీశాంత్‌లు పఠాన్ కంటే ముందే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు.2019 పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీలో జాయిన్ అయిన గౌతం గంభీర్.. ఈస్ట్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి ఘనవిజయం సాధించాడు. అతడి తర్వాత హర్భజన్ సింగ్.. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తరఫున రాజకీయ అరంగేట్రం చేశాడు. 2022లో అతడు ఆప్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఇక శ్రీశాంత్ విషయానికొస్తే.. 2016లో అతడు కేరళ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తరఫున తిరువనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలోకి దిగాడు. కానీ అతడు మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో యూసుఫ్ నాలుగోవాడు. కాంగ్రెస్ అగ్రనాయకుడు అధీర్ రంజన్ చౌదరిపై పోటీ చేయనున్న యూసుఫ్.. రాజకీయాలలో ఏ మేరకు రాణిస్తాడో చూడాలి.2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు : ఎంఎస్ ధోని (కెప్టెన్),న


వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్, గౌతం గంభీర్, విరాట్ కోహ్లీ, సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్, పియూష్ చావ్లా, యూసుఫ్ పఠాన్, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్, అషిష్ నెహ్రా, మునాఫ్ పటేల్, శ్రీశాంత్, ప్రవీణ్ కుమార్.

# అండర్సన్‌ను చూసి నేర్చుకో..

## భారత పేసర్‌కు ఆసీస్ దిగ్గజం సలహా

భారత పేసర్ మహ్మద్ షమీ కాలి మడమ సర్జరీ నుంచి కోలుకుంటున్నాడు. వరల్డ్ కప్ తర్వాత గాయపడిని షమీ ఐపీఎల్‌తో పాటు టీ20 వరల్డ్ కప్ టోర్నీకి దూరమయ్యే చాన్స్ ఉంది. టీమిండియా ప్రధాన పేసర్లలో ఒకడైన షమీ ప్రస్తుతం నేషనల్ క్రికెట్ అకాడమీ పునరావాసం పొందుతున్నాడు. ఈ సమయంలో ఆస్ట్రేలియా దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ భారత స్పీడ్‌స్టర్‌కు విలువైన సలహా ఇచ్చాడు. ఫిట్‌గా ఉండడంతో దీర్ఘ కాలం బౌలింగ్ చేయడం ఎలాగో జేమ్స్ అండర్సన్‌ను చూసి నేర్చోకోవాలని అని షమీకి సూచించాడు.'షమీకి అనుభవం ఉంది. అతడు ఎక్కువ రోజుల నుంచి ఆడుతున్నాడు. షమీ అత్యుత్తమ బౌలర్. అయితే.. వయసు పెరుగుతున్నా కొద్దీ మరింత మోటివేట్ కావాలి. ఎక్కువగా కష్టపడాలి.

అప్పుడే మైదానంలో మంచి ప్రదర్శన చేయగలం. అండర్సన్‌ను చూడండి. అతడు 41 ఏండ్లలో 700వ వికెట్ తీశాడు. ఇప్పటికీ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. షమీలాంటి వాళ్లు అండర్సన్‌ను చూసి నేర్చుకోవాలి' అని మెక్‌గ్రాత్ తెలిపాడు. ఆసీస్ లెజెండరీ పేసర్ అయిన మెక్‌గ్రాత్ టెస్టుల్లో 563 వికెట్లు పడగొట్టాడు.గ్లెన్ మెక్‌గ్రాత్‌టెస్టు క్రికెట్ చరిత్రలో..భారత పర్యటనలో జేమ్స్ అండర్సన్ వైజాగ్ టెస్టులో బరిలోకి దిగాడు. ధర్మశాల టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఔట్ చేసి 700 వికెట్ల క్లబ్‌లో చేరాడు. 147 ఏండ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన తొలి పేసర్‌గా జిమ్మీ రికార్డు నెలకొల్పాడు. మొత్తంగా .. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఏడొందల వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. శ్రీలంక లెజెండరీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్,


దివంగత షేన్ వార్న్‌లు అతడి కంటే ముందున్నారు.

# నిషాంత్ పంచ్ అదిరెన్..

## ఒలింపిక్స్ బెర్తుకు ఇంకొక్క అడుగే

వరల్డ్ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్‌లో భారత స్టార్ బాక్సర్ నిషాంత్ దేవ్ తన పంచ్ పవర్ చూపించాడు. ఈ మెగా టోర్నీలో 71 కిలోల విభాగంలో పోటీ పడుతున్న నిషాంత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన 16వ రౌండ్‌లో గ్రీస్‌కు చెందిన క్రిస్టోస్ కరాయ్‌టిస్ చిత్తుగా ఓడించాడు. దాంతో, ప్యారిస్ ఒలింపిక్స్ (%జూఘతీఱం శీశ్రీఎఎజూఱఎం% 2024) బెర్తుకు అడుగు దూరంలో నిలిచాడు.మరొక్క మ్యాచ్‌లో గెలిచాడంటే నిషాంత్ విశ్వక్రీడలకు అర్హత సాధిస్తాడు. ఈ టోర్నీలో సెమీస్ చేరిన నలుగురు బాక్సర్లకు ప్యారిస్ ఒలింపిక్ బెర్తు దక్కనుంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచిన నిషాంత్ తొలి రౌండ్ నుంచి క్రిస్టోస్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. రెండో రౌండ్‌లోనూ చెలరేగిన నిషాంత్ 5-0తో గెలుపొందాడు. తర్వాతి రౌండ్‌లో అతడు అమెరికాకు చెందిన ఒమరి జోన్స్‌ను ఢీకొట్టనున్నాడు.నలుగురు బాక్సర్లుఈ ఏడాది విశ్వక్రీడలకు నలుగురు భారత బాక్సర్లు అర్హత సాధించారు. మహిళల విభాగంలో తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్(50 కిలోలు), లొవ్లీనా బొర్గోహైన్(75 కిలోలు), ప్రీతి(54 కిలోలు) క్వాలిఫై కాగా.. పురుషుల తరఫున ప్రవీణ్ హుడా(57 కిలోలు) ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్నాడు.



# వరల్డ్ నంబర్ 1 జోడీ స్పెషల్ డాన్స్.. వీడియో వైరల్



భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి కొత్త ఏడాదిలోనూ జోరు చూపిస్తోంది. నిరుడు ఆసియా క్రీడ పసిడి కాంతులు విరజిమ్మిన ఈ ద్వయం తాజాగా ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గింది. చైనీస్ తైపీకి చెందిన లీ ఝే యూ, యాంగ్ పొ సువాన్ జంటపై ఫైనల్లో అద్భుత విజయంతో రెండో సూపర్ 750 టైటిల్ ఖాతాలో వేసుకున్నారు.మ్యాచ్ ముగియగానే ఆనందం పట్టలేకపోయిన సాత్విక్.. చిరాగ్‌ను అమాంతం ఎత్తుకున్నాడు. అంతేనా.. ఇద్దరూ కలిసి తమ విజయాన్ని కోర్టులోనే చిందేశారు. తమదైన స్టెప్పులతో విజయాన్ని ఆస్వాదించారు. రాకెట్‌ను గిరగిరా తిప్పుతూ.. శరీరాన్ని ముందుకూ, వెనక్కీ కదిలిస్తూ సాత్విక్ అదిరిపోయే డాన్స్ చేశాడు. కాసేపు ఒంటికాలిపై స్టెప్స్ వేసి ప్రేక్షకులను అలరించాడు. ఇంతకూ ఆ స్పెషల్ డాన్స్ సెలబ్రేషన్ ఎప్పుడు మొదలైందో తెలుసా..?'థామస్ కప్ నుంచి మా ఈ డాన్స్ సెలబ్రేషన్ మొదలైంది.

అప్పటినుంచి ఇదొక అలవా టుగా మారింది. అయితే.. మేము ఈ డాన్స్ చేసి చాలా రోజులైంది. నాలుగో ఫైనల్ తర్వాత మా స్పెషల్ డాన్స్ చేశాం' అని సాత్విక్ వెల్లడించాడు. వరల్డ్ నంబర్ 1 గా ఫ్రెంచ్ ఓపెన్‌లో అడుగుపెట్టిన సాత్విక్ చిరాగ్ జోడీ తొలి రౌండ్ నుంచి దుమ్మురేపింది. టైటిల్ పోరులోనూ అదే జోరు చూపిస్తూ లీ ఝే, యాంగ్ జంటను 21-11, 21-17తో చిత్తు చేసింది.దాంతో, చైనీస్ తైపీ జోడీపై తమ రికార్డును 3-0కు పెంచుకుంది. నిరుడు సూపర్ ఫామ్‌తో వరుస టైటిళ్లు సాధించిన సాత్విక్ -చిరాగ్ జంట 2019లో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు చేజారిన ట్రోఫీని ఈ స్టార్ ద్వయం 2022లో ముద్దాడింది. మళ్లీ ఇప్పుడు తమ సంచలన ఆటతో బలమైన ప్రత్యర్థులను చిత్తు చేస్తూ.. రెండోసారి విజేతగా అవతరించింది.

# ఒంటిచేత్తో జట్టును గెలిపించి..

## నాలుగో ఇన్నింగ్స్‌లో నాటౌట్‌గా



ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీమరో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. క్రిస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టెస్టులో సూపర్ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించి అరుదైన ఫీట్ సాధించాడు. నాలుగో ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచి జట్టును గెలిపించిన మూడో వికెట్ కీపర్‌గా చరిత్ర సృష్టించాడు. అతడి కంటే ముందు ఆసీస్ మాజీ వికెట్ కీపర్ ఆడం గిల్‌క్రిస్ట్, టీమిండియా స్టార్ రిషభ్ పంత్ ఈ ఘనత సాధించారు.విధ్వంసక ఆటగాడైన గిల్ క్రిస్ట్ 1999లో పాకిస్థాన్‌పై వీరవిహారం చేశాడు. ఆసీస్ ఓటమి తప్పదనుకున్న దశలో ఈ లెఫ్ట్‌హ్యాండర్ అజేయ శతకం బాదాడు. 163 బంతుల్లో 149 పరుగులతో ఆస్ట్రేలియాను గెలిపించాడు. ఇక భారత చిచ్చరపిడుగు రిషభ్ పంత్ 2021లో ఆస్ట్రేలియాపై అదరగొట్టాడు. బ్రిస్బేన్‌లో జరిగిన టెస్టులో పంత్ సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. 138 బంతుల్లో 89 నాటౌట్‌తో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.తొలి టెస్టులో భారీ తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించిన ఆసీస్ రెండో మ్యాచ్‌లోనూ అద్భుతం చేసింది. నాలుగో రోజు 202 పరుగులు అవసరమైన దశలో 80 పరుగులకే ఐదు వికెట్లు పడ్డాయి. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన క్యారీ అద్భుతంగా ఆడాడు. కివీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ అర్ధ శతకం బాదాడు.కెప్టెన్ కమిన్స్(32 నాటౌట్)తో కలిసి న్యూజిలాండ్ నుంచి విజయాన్ని లాగేసుకన్నాడు. దాంతో, రెండు టెస్టుల్లోనూ విజయ ఢంకా మోగించిన ఆసీస్ 2-0తో టెస్టు సిరీస్ సొంతం చేసుకుంది. ఆసీస్‌పై పది మ్యాచుల్లో తొమ్మిది ఓటములతో కివీస్ చెత్త రికార్డు మూటగట్టుకుంది.

# ఫైనల్లో వందకే విదర్భ ఆలౌట్..

## తొలి ఇన్నింగ్స్‌లో ముంబైకి భారీ ఆధిక్యం



వాంఖడే స్టేడియంలో హెూరాహెూరీగా సాగుతున్న రంజీ ఫైనల్లో ముంబ జట్టు పట్టుబి గిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆల్‌రౌండర్ శా ర్దుల్ ఠాకూర్(75) హాఫ్ సెంచరీతో పరువు కా పాడగా.. అనంతరం బౌలర్లు నిప్పులు చెరి గారు. ధవల్ కులకర్ణి, శామ్స్ ములానీ విజృంభణతో విదర్భ జట్టు 105 పరుగులకే ఆలౌ టయ్యింది. దాంతో, ముంబైకి 119 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో రోజు కీలకమైన మూడు వికెట్లు తీసిన ముంబై బౌలర్లు రెండో రోజు విదర్భ ఆటగాళ్లను బెంబేలెత్తించారు.ఆట మొదలైన కాసేపటికే తైడేను ఔట్ చేసిన కులకర్ణి ప్రత్యర్థిని కష్టాల్లోకి నెట్టాడు. ఆ తర్వాత ఆదిత్య థాకరే(19), యశ్ రాథోడ్(27)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేయగా.. థాక్రేను ఔట్ చేసిన శామ్స్ ములానీ ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత తనుష్ కొటియన్ టెయిలెండర్ల పనిపట్టడంతో విదర్భ లంచ్ సమయానికే చాపచుట్టేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ముంబై బ్యాటర్లు చెలరేగి ఆడితే విదర్భకు కష్టకాలమే.వాంఖడే స్టేడియం జరుగుతున్న ఫైనల్లో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది.

టాపార్డర్‌లో ఓపెనర్ పృథ్వీ షా(46) ఒక్కడే ఫర్వాలేదనిపించగా.. కెప్టెన్ అజింక్యా రహానే(7), శ్రేయస్ అయ్యర్(7) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కష్టాల్లో పడ్డ జట్టును శార్ధూల్ (75) వీరోచిత హాఫ్ సెంచరీతో ఒడ్డును పడేశాడు. దాంతో, ముంబై 224 పరుగులకు ఆలౌటైంది. యశ్ ఠాకూర్, హర్ష్ దూబేలు చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

# పంత్‌కు లైన్‌క్లియర్..

## ఆ మ్యాచ్‌తోనే ఐపీఎల్ పునరాగమనం



భారత స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ పునరామనంపై నెలకొన్న పలు సందేహాలకు తెర పడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ పంత్ బరిలోకి దిగుతున్నాడు. అవును.. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఫ్యాన్స్‌ను అలరించేందకు పంత్‌కు లైన్ క్లియర్ అయింది. బెంగుళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ఈ డాషింగ్ బ్యాటర్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చింది.దాంతో, పంత్ రీ-ఎంట్రీకి ఉన్న ఏకైక అడ్డంకి కూడా తొలగిపోయింది. త్వరలోనే అతడు వైజాగ్‌లో జరిగే ఢిల్లీ ప్రీ-క్యాంప్‌లో జట్టుతో కలువనున్నాడు. 17వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ తొలి రెండు మ్యాచ్‌లను విశాఖపట్టణంలో ఆడనున్న విషయం తెలిసిందే. రెండేండ్ల క్రితం కారు యాక్సిడెంట్‌లో మృత్యుంజయుడిగా బయటపడిన పంత్ మోకాలి సర్జరీ చేయించుకున్నాడు. అనంతరం ఎన్‌సీఏలో రీహాబిలిటేషన్‌లో ఉన్న అతడు కష్టమైన వ్యాయామాలు చేసి ఫిట్‌నెస్ సాధించాడు. నెట్స్‌లో బ్యాటింగ్, వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేస్తూ చెమటలు చిందించాడు.దాంతో, ఐపీఎల్ 17వ సీజన్‌లో ఢిల్లీ సారథిగా పంత్ రీ- ఎంట్రీ ఇస్తాడని మెంటార్ సౌరభ్ గంగూలీ, హెడ్‌కోచ్ రికీ పాంటింగ్‌లు సైతం చెప్పేశారు. అయితే.. ఈసారి పంత్ మునపటిలా వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఆడడం కష్టమే. అతడిపై ఎక్కువ పడకుండా వికెట్ కీపింగ్ బాధ్యతలు వేరేవాళ్లకు అప్పగించే చాన్స్ ఉంది. మార్చి 22న ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం కానుంది. తొలి పోరులో ఢిల్లీ జట్టు మార్చి 23న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.

